క్లుప్తంగా

జెడ్.బెన్నవరం వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖలు చూపుతున్న వలంటీర్లు

రావికమతం: జెడ్.బెన్నవరంలో 8 మంది వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారి రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శి పోలిరెడ్డికి అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి గ్రామ స్వరాజ్య పాలనకు శ్రీకారం చుట్టి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన సేవలందిస్తుంటే, తమపై అక్కసుతో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ నిత్యం నిందిస్తుండటమే కాక వారి అనుయాయుల ద్వారా కోర్టులో పిల్ వేసి ప్రజా సేవకు దూరం చేశారన్నారు. దీంతో తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేశామన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటేయండి

మాడుగుల రూరల్: ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఈర్లె అనురాధ, బూడి ముత్యాల నాయుడులకు మద్దతుగా శుక్రవారం కె.జె.పురంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులను కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఆదారి గణేష్, మాజీ సర్పంచ్ పెంటకోట అప్పారావు, తోరాతి రూనీ, బుద్ద శ్రీను, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

1న సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న పింఛను నగదును బ్యాంకుల ద్వారా విత్ డ్రా చేసి, వచ్చే నెల ఒకటి నుంచి ఐదో తేదీ లోపు గ్రామ సచివాలయాల వద్ద సిబ్బందితో పంపిణీ చేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేస్తారన్నారు. మండలంలో 11,952 మందికి 3 కోట్ల 58 లక్షల 62 వేల రూపాయలు అందిస్తామన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీ పరమేశ్వరుల 191వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల మురళీకృష్ణ చంద్రకళ దంపతులచే ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, కొండూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు,సాయిలు ప్రత్యేక పూజలు చేయించారు. గౌరీ, గీత మహిళామండలి, శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళామండలి, తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయని బృందం సభ్యులు శివకీర్తనలు ఆలపించి, జానపద నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం



అరకులోయలో కురుస్తున్న వర్షం

అరకులోయ రూరల్: మండలంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

టీడీపీ దగా హామీలపై నిలదీయండి

- డ్వాక్రా, రైతు రుణాలు ఎందుకు మాఫీ చేయలేదు
- గ్రామాల్లోకి వస్తున్న ఆ పార్టీ నాయకులను ప్రశ్నించండి
- ఎన్నికల ప్రచారంలో చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ పిలుపు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ



కవగుంట గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

రావికమతం: చంద్రబాబు ఉచిత హామీలకు ఆకర్షితులై అధికారమిస్తే అన్ని వర్గాలకు కష్టాలు తప్పవని చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలోని కవగుంట, కేబీపీ అగ్రహారం, కొమిర గ్రామాల్లో ఆయన శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. పేదల బతుకులు మారాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. గత పాలనలో చంద్రబాబు హామీలిచ్చి నెరవేర్చకుండా మోసం చేసి ఇప్పుడు ఓటమి భయంతో బీజేపీ, జనసేన పార్టీతో పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. గత టీడీపీ పాలనలో డ్వాక్రా, రైతు రుణాలు ఎందుకు మాఫీ చేయలేదో ఆ పార్టీ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. వాటిని నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి ఇంటింటికీ వస్తున్నారని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఆశపడి ఓటేస్తే, ఆ తర్వాత మహిళలకు సిగపట్లు తప్పవని, ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో చూస్తున్నామన్నారు. ఈ ఉచిత ప్రయాణ భారమంతా మన నెత్తిన వేస్తారని హెచ్చరించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. తనకు ఓటు వేసి మళ్లీ గెలిపిస్తే మరింతగా చోడవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని అభ్యర్థించారు. పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు దాసరి సూర్యకుమారి వరహాలు, గొర్లె రవికుమార్, సత్యనారాయణ, ప్రసాద్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కొత్తకోటలో ధర్మశ్రీ సతీమణి విస్తృత ప్రచారం..

కొత్తకోటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ సతీమణి విజయ విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఒకటో వార్డు నుంచి ఆమె ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ధర్మశ్రీని, ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నను గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, ఎంపీటీసీలు–1, 2, 3 కుంచాలక్ష్మి, పూడి దేవ, పైల చినమ్మలు, ముఖ్య నాయకులు శీలం గోవింద, శంకర్రావు, మహిళ నాయకురాలు లేగా ఉష పాల్గొన్నారు.



కొత్తకోట గ్రామంలో ధర్మశ్రీకి మద్దతుగా ఓటు అభ్యర్థిస్తున్న ధర్మశ్రీ సతీమణి విజయ

చోడవరంలో 2 నామినేషన్ల తిరస్కరణ

చోడవరం: స్థానిక అసెంబ్లీ స్థానానికి దాఖలైన నామినేషన్ల స్క్రూట్నీలో రెండు తిరస్కరణకు గురయ్యాయి. నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. చిన్నికృష్ణ పర్యవేక్షణలో శుక్రవారం ఎన్నికల అధికారులు నామినేషన్లు పరిశీలించారు. మొత్తం ఎనిమిది మంది 15 సెట్ల నామినేషన్లు వేయగా, వీటిలో ఇద్దరివి తిరస్కరణకు గురయ్యాయి. వాటిలో వైఎస్సార్‌సీపీ డమ్మీగా వేసిన ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సతీమణి కరణం వెంకటవిజయలక్ష్మి, టీడీపీ డమ్మీగా వేసిన గూనూరు మల్లునాయుడు నామినేషన్లు తిరస్కరించినట్టు ఆర్వో చిన్నికృష్ణ చెప్పారు. మిగతా ఆరు నామినేషన్లలో కరణం ధర్మశ్రీ (వైఎస్సార్‌సీపీ), జగతా శ్రీనువాసరావు (కాంగ్రెస్), వేగి మహాలక్ష్మినాయుడు (బీఎస్పీ), కె.ఎస్.ఎన్.ఎస్ రాజు (టీడీపీ), సవరాల గణేష్ (సీపీఐ మార్కిస్ట్ లిబరేషన్), పేరిచెర్ల వివేకరాజు (స్వతంత్ర) నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు తెలిపారు.



నామినేషన్లు పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ

మాడుగులలో 6...

మాడుగుల: స్థానిక అసెంబ్లీ స్థానానికి 14 మంది 29 సెట్ల నామినేషన్లు వేశారు. వీటిని శుక్రవారం స్క్రూట్నీ చేయగా ముగ్గురు అభ్యర్థులకు సంబంధించి ఆరు నామినేషన్లు తిరస్కరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి తెలిపారు. బీ ఫామ్ అందజేసిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెసు, బీఎస్పీ నామినేషన్లతోపాటు స్వతంత్ర అభ్యర్థులు 11 మందివి 23 సెట్ల నామినేషన్లు ఆమోదం పొందాయన్నారు. ఈ నెల 29వ తేదీ లోగా నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఆ రోజు సాయంత్రానికి ఎంత మంది అభ్యర్థులు పోటీలో ఉంటారన్న విషయంపై స్పష్టత వస్తుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే యాదవుల సంక్షేమం

- వచ్చే ఎన్నికల్లో పూర్తిగా మద్దతు ఇవ్వండి
- యాదవ సంఘాల ప్రతినిధులతో చోడవరం ఎన్నికల పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు



నియోజకవర్గ యాదవ సంఘాల ప్రతినిధులతో ఎన్నికల పరిశీలకుడు చినఅప్పలనాయుడు

చోడవరం: వైఎస్సార్‌సీపీ హయాంలోనే యాదవుల సంక్షేమానికి ఎంతో కృషి జరిగిందని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు అన్నారు. యాదవ సంఘాల ప్రతినిధులతో చోడవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. 35 ఏళ్లుగా యాదవులను తెలుగుదేశం పార్టీ నయవంచన చేసిందన్నారు. ఆ సామాజిక వర్గాన్ని కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంది తప్పా ఎప్పుడూ వారి సంక్షేమానికి టీడీపీ కృషి చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక యాదవులకు అన్ని రంగాల్లోనూ సముచిత స్థానం కల్పించిందన్నారు. విశాఖపట్నం మేయర్ పదవిని వైఎస్సార్‌సీపీ యాదవులకు ఇచ్చిందన్నారు. అదే విధంగా చోడవరం నియోజకవర్గంలో యాదవులకు డీసీఎంఎస్ చైర్మన్ పదవితోపాటు పార్టీలో క్రియాశీల పదవులను ఇవ్వడం జరిగిందన్నారు. యాదవుల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే జరుగుతోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు పూర్తిగా అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో యాదవులంతా సమష్టిగా కృషిచేసి వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చినప్పలనాయుడు కోరారు. దీనిపై యాదవ సంఘాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. వైఎస్సార్‌సీపీ వచ్చాక యాదవులకు మంచి గుర్తింపు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో యాదవులంతా వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇస్తామని వారు తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, బుచ్చెయ్యపేట మండలం అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్లు జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, సర్పంచ్ కూర్మదాసు మాలిబాబు, బర్ల శివ, బూరా రమేష్ పాల్గొన్నారు.

వేడుకగా తలుపులమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

- ఎంపీ అభ్యర్థి బూడికి ఘన సన్మానం



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడిని ఘనంగా సన్మానిస్తున్న గ్రామస్తులు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో నూతనంగా నిర్మించిన తలుపులమ్మ ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపనన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. అంపోలు ఉమామహేశ్వర శర్మ పర్యవేక్షణలో నిత్యార్చనలు, బీజన్యాసం, ధాతు న్యాసం, యంత్ర ప్రతిష్ట, ఆలయ శిఖర ప్రతిష్ట, పూర్ణాహుతి కార్యక్రమాల అనంతరం అమ్మవారి దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులతోపాటు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల సాయి ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, గేదెల అచ్చింనాయుడు, బంటు జలంధర్, ఆలయ కమిటీ సభ్యులు గండి సత్యనారాయణ, సిరపరపు రమణారావు, రొంగలి నర్సింగరావు, గణేష్, ప్రసాద్, ముర్రు వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

హాస్టళ్లలో టెన్త్ టాపర్లకు అభినందనలు

ఎస్.రాయవరం: వసతి గృహ విద్యార్థులు ఉన్నత చదువులకు పునాదులు వేసుకోవాలని బీసీ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరావు అన్నారు. రేవుపాలవరం బీసీ బాలికల వసతి గృహంలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. 550 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన చోడిపల్లి అనూష, 525 మార్కులు సాధించి ద్వితీయ సాధించి మైలపల్లి వసంత, 520 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన సూరాడ కృష్ణవేణిలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

వైభవంగా కనకమహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన



కనకమహాలక్ష్మి అమ్మవారు

చీడికాడ: పెదగోగాడలో కనకమహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ట, పసిడి కలశ స్థాపన కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఇక్కడ శిథిలమైన దేవాలయం స్థానంలో గ్రామస్తులు, దాతల సహకారంతో పునర్నిర్మించారు. మూడు రోజులుగా అంకురార్పణ పూజలతో ప్రారంభమైన ప్రతిష్ట కార్యక్రమాలు చివరి రోజు భారీ అన్నసమారాధనతో ముగిసింది. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

ఆశాజనకంగా మిరప సాగు



దాలవలసలో మిరపచేను

కె.కోటపాడు: మండలంలో మిరప సాగు ఆశాజనకంగా ఉంది. మండలంలో దాలివలస, పిండ్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శృంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో వందెకరాల్లో సాగు చేస్తున్నారు. సాగు కాలంలో పది రోజులకు ఒక మారు నీటి తడుపు అందిస్తున్నారు. ఈ విధంగా సాగు చేపట్టిన 45 రోజులకు మిరప పంట పూతదశకు చేరుకోవడంతో దిగుబడి ప్రారంభం కానుందని రైతులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలో మంచి లాభాలు పొందలగమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

25 ఏళ్ల తర్వాత వడ్డిప-గైరంపేట రోడ్డుకు మోక్షం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో నిర్మాణం



సుందరంగా వడ్డిప-గైరంపేటకు తారురోడ్డు

రోలుగుంట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో 25 ఏళ్ల తర్వాత రెండు మండలాలను కలిపే వడ్డిప – గైరంపేట రోడ్డుకు మోక్షం కలిగింది. నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డుపై రాళ్లు తేలి ఉండటంతో దశాబ్దాలుగా రాకపోకలు సాగించేందుకు వడ్డిప, ఎం.కె.పట్నం, బి.బి.పట్నం, రత్నంపేట గొలుగొండ మండలం గైరంపేట పంచాయతీల ప్రజలు నానా ఇక్కట్లు పడేవారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారినా ఈ రహదారి నిర్మాణానికి నోచుకోలేదు. గత టీడీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు కనీసం ఇటువైపు చూసిన పాపానపోలేదు. దాంతో వాహనదారులు అధ్వాన రోడ్డుపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు రాళ్లు తేలిపోయి ఉండటంతో వాహనాలు పాడవుతున్నాయని వాపోతున్నా పట్టించుకున్న నాథుడే లేకపోయాడు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి ఆయా పంచాయతీల ప్రజలు తమ సమస్య మొరపెట్టుకున్నారు. దీనిపై చలించిన ఆయన ఈ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. అయితే కాంట్రాక్టరు కొంతవరకు పనులు చేసి వదిలేశాడు. దాంతో మరలా వాహనదారుల సమస్య మొదటికొచ్చింది. దాంతో ధర్మశ్రీ చొరవ తీసుకుని పూర్తి చేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారు. సమస్యలు గుర్తించి పరిష్కరించే దిశగా అడుగులేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా నిఘా

- ఎన్నికల జనరల్ అబ్జర్వర్ దల్‌జిత్ సింగ్ మంగట్



ఆర్వో కార్యాలయంలో సూచనలు చేస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ దల్‌జిత్ సింగ్ మంగట్

చోడవరం: ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బంది అజాగ్రత్తగా ఉండరాదని సార్వత్రిక ఎన్నికల జనరల్ అబ్జర్వర్ దల్‌జిత్ సింగ్ మంగట్ ఆదేశించారు. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల జనరల్ అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఇక్కడ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటింగ్ యంత్రాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్ వివరాలు, ఎన్నికల విభాగం పనితీరును పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన పలు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియలో నిబంధనలు విధిగా పాటించాలన్నారు. రాజకీయ పార్టీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీల ప్రచారాలపై పూర్తిగా నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచార వాహనాలు తిరగకుండా నిఘా ఉంచాలని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్వో చిన్నికృష్ణ, ఏఆర్వో వేణుగోపాలరావులకు పలు ఆదేశాలు ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఉపాధి

- రోలుగుంటలో ధర్మశ్రీ కుమార్తె స్వాతి ముమ్మర ప్రచారం



కొవ్వూరు గడబల చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ధర్మశ్రీ కుమార్తె స్వాతి

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గెలుపు కోరుతూ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే శరభవరం, పాపంపేట, రత్నంపేట తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి బీద, బడుగు వర్గాల వారి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, వాటి అమలు, ఒకటో తేదీనే తలుపు తట్టి పింఛన్లు ఠంచన్‌గా ఇస్తున్న వలంటీర్ల సేవల గురించి వివరిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కొవ్వూరు గ్రామ సమీపంలో గడబల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మలను వెంటబెట్టుకుని కలిశారు. అక్కడ పనులు, శ్రామికుల కష్టాలు, రోజు కూలి, మస్టరు విధానం, మౌలిక సదుపాయాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలకు ఉపాధి కల్పిస్తున్నారని, గత టీడీపీ పాలనలో యంత్రాలతో పనులు చేయించి ఎంతోమంది కూలీల పొట్టకొట్టారని ఆరోపించారు. మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, మన ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. స్వాతి మాటలకు ముగ్ధులైన ఉపాధి కూలీలు జై జగన్, జైజై ధర్మశ్రీ, జైజై ముత్యాలనాయుడు అని నినదించారు.

ఘనంగా కార్యసిద్ధి హనుమాన్ విగ్రహ ప్రతిష్ట

- డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ పూజలు



స్వామివారి సేవలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ

దేవరాపల్లి: రైవాడ శివారు బేతపూడి కాలనీలో కార్యసిద్ధి హనుమాన్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ అత్యంత నియమ నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ స్వామివారిని దర్శించుకున్నారు. విగ్రహ దాత దుక్క వెంకటరమణ, సర్పంచ్ చల్లా లక్ష్మి, ఉర్రూకుల అప్పారావు, చల్లా నాయుడు, చల్లా నానాజీ, దుక్క ఈశ్వరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, రొంగలి నారాయణమ్మ తదితర ప్రజాప్రతినిధులు, పెద్దలు పూజలు చేశారు. ఉదయం నుంచి మహిళల కోలాటం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, రాత్రికి సింహాద్రి అప్పన్న సేవా గరిడీ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఉపాధి కూలీల సంక్షేమానికి కృషి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ



లక్కవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ

చోడవరం: రోజువారీ కూలీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ అండగానే ఉందని ఆ పార్టీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ అన్నారు. లక్కవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీపథకం పనుల్లో పనిచేస్తున్న కూలీలను శుక్రవారం ఆయన కలిశారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీ గిట్టుబాటు, పనిదినాలుపై ఆరా తీశారు. కూలీలు ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ఉపాధి పథకం సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూలీలకు ఉపాధి కల్పించాలని, వలసలు నివారించాలన్న ఆశయంతో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టడం జరిగిందన్నారు. తర్వాత జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గడిచిన ఐదేళ్లలో ఉపాధి కూలీలకు అదనపు సౌకర్యాలు కల్పించడంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని ధర్మశ్రీ చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అందరూ బలపర్చాలని కోరారు. ముఖ్యమంత్రిగా మరలా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే ఇప్పుడు అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. వలంటీర్ల వ్యవస్థను మరలా పునరుద్ధరించి ఇంటి వద్దకే పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అందేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ధర్మశ్రీ చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తనను, ముత్యాలనాయుడుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీరంరెడ్డి వెంకటరమణ, ఉపసర్పంచ్ బంగారు నాయుడు,ఎంపీటీసీలు రాజునాయుడు, పార్టీ నాయకులు చిటుబోలు జగన్నాధరావు, శానాపతి శ్రీనువాసరావు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తు ప్రణాళిక

నాతవరం : వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో 2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఆయన శుక్రవారం సమగ్ర శిక్షా సిబ్బందితో సమావేశం నిర్వహించారు.